ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి బీఫాం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థికి బీ ఫాం

పార్టీ నేతలతో సమన్వయం చేసుకోవాలి: కేసీఆర్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి జరిగే ఉప ఎన్నికకు పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు బీ ఫాం అందించారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో శనివారం మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో కేసీఆర్ బీ ఫాం అందించారు. ఉప ఎన్నికలో పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని, జిల్లాలో స్థానిక సంస్థల్లో పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నందున బీఆర్‌ఎస్ పార్టీ విజయం ఖాయమేనని కేసీఆర్ చెప్పారు.

వికసిత్ భారత్‌లో ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం

సూత్రప్రాయంగా కేంద్రం అంగీకారం • ఉత్తర భాగం రోడ్డు పనులకు త్వరలో టెండర్లు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగాన్ని వికసిత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ అధికారులు గత గురువారం ఢిల్లీలో కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ అధికారులతో సమావేశమైన సందర్భంగా ఈ మేరకు హామీ లభించింది. మరోవైపు, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణం కోసం 85 శాతం భూసేకరణ పూర్తికావడంతో త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే మూడేండ్లలో ఆర్‌ఆర్‌ఆర్‌ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్‌ఆర్‌ఆర్‌కు ప్రణాళిక రూపొందించిన విషయం విదితమే. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగాన్ని భారత్ మాల పరియోజన ప్రాజెక్టు కింద కేంద్రం చేపడుతుండగా, తాజాగా దక్షిణ భాగాన్ని వికసిత్ భారత్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టేందుకు కేంద్రం అంగీకరించింది. మొత్తం 340 కిలోమీటర్ల పొడవున నాలుగు లేన్లుగా రీజనల్ రింగ్‌రోడ్డును సంగారెడ్డి, తూప్రాన్, చౌటుప్పల్, ఆమన్‌గల్, శంకరపల్లి తదితర పట్టణాలగుండా నిర్మించనున్నారు. ఉత్తర భాగం కింద రూ.9,500 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 158.645 కిలోమీటర్లమేర రోడ్డు నిర్మించాలని నిశ్చయించారు. ఇది సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి, చౌటుప్పల్ తదితర పట్టణాలమీదుగా వెళ్తుంది. దక్షిణ భాగం కింద రూ.6,480 కోట్లతో 182 కిలోమీటర్లమేర రోడ్డును నిర్మించనున్నారు. ఇది చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి తదితర పట్టణాలగుండా వెళ్తుంది.

ఉత్తర భాగం రోడ్డుకు త్వరలో టెండర్లు

భారత్ మాల పరియోజన ఫేజ్-1లో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగాన్ని 158.645 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేస్తుండగా, దీనికి ఇప్పటికే 85శాతం వరకు భూసేకరణ పూర్తయింది. మొత్తం 1935.35 హెక్టార్లకుగాను ఇప్పటివరకు 1500 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. దీంతో వచ్చే మూడు నెలల్లోగా మిగిలిన భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసి టెండర్ల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణకు సుమారు రూ. 5,170 కోట్లకుపైగా ఖర్చవుతుండగా, ఇందులో రూ. 2,585 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఇదికాకుండా యుటిలిటీస్ షిఫ్టింగ్ కోసం రూ. 363 కోట్లు ఖర్చవుతుండగా, ఈ మొత్తాన్ని కేంద్రమే భరించేందుకు ముందుకొచ్చింది.

లోకం పోకడ



రేషన్‌కార్డులో ఒక్కరికే జీరోబిల్లు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం అమలుచేస్తున్న గృహజ్యోతి పథకంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత స్పష్టతనిచ్చారు. ఒక రేషన్ కార్డుపై ఒక్కరికే ఇది వర్తిస్తుందని, 200 యూనిట్లలోపు విద్యుత్తును వాడుకున్న వారికే ఈ పథకం వర్తిస్తుందని, అంతకంటే ఒక్క యూనిట్ ఎక్కువొచ్చినా వర్తించదని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 200 యూనిట్ల లోపున్నా బిల్లులు ఇస్తున్నారన్న విలేకరుల ప్రశ్నకు భట్టి స్పందిస్తూ అలా వచ్చినవారు బిల్లు కట్టాల్సిన పనిలేదని పేర్కొన్నారు. రేషన్ కార్డు, సర్వీస్ నంబర్, ఆధార్‌కార్డును ప్రజాపాలన అధికారికి అప్పగిస్తే ఆటోమెటిక్‌గా జీరో బిల్లు వస్తుందని వివరించారు. గృహజ్యోతి పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 40,33,702 మందికి జీరో బిల్లులిచ్చినట్టు తెలిపారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించబోమని చెప్పారు.

వారికీ రైతు భరోసా

రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలున్న భూముల సమాచారం తమవద్ద లేదని, ఈసారికి వాటికి కూడా రైతుభరోసా నిధులు జమచేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు మూడెకరాలలోపు ఉన్న రైతులకు నిధులు వేశామని, ప్రస్తుతం నాలుగెకరాలు ఉన్న రైతులకు నిధులు జమచేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే ఐదెకరాల రైతులకు నిధులు పంపిణీ చేస్తామన్నారు. గత ప్రభుత్వం కొండలు, గుట్టలున్న బడాబాబులకు రైతుబంధు నిధులు జమచేసి రూ.20 వేల కోట్లను దుర్వినియోగం చేసిందన్న వ్యాఖ్యలను గుర్తుచేసిన విలేకరులకు మంత్రి భట్టి పైవిధం గా సమాధానం ఇచ్చారు.

12న జీరో వడ్డీ రుణ పథకం

మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేసేందుకు త్వరలోనే మైక్రోస్మాల్ ఇండస్ట్రీ పార్కులను ప్రారంభిస్తామని మంత్రి భట్టి తెలిపారు. 12న వడ్డీలేని రుణ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది విద్యుత్తు వినియోగం రికార్డుస్థాయిలో పెరిగిందని, మార్చి 8న 15,623 మెగావాట్ల విద్యుత్తు వినియోగమైనట్టు చెప్పారు. నిరుడు అదే రోజున 15,497 మెగావాట్లు వినియోగమై, ఇప్పుడా రికార్డు బద్దలైందని తెలిపారు. 16,500 మెగావాట్ల విద్యుత్తును సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, కాబట్టి ప్రజలు నిశ్చింతగా ఉండాలని కోరారు. త్వరలోనే పవర్ పాలసీ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ప్రెస్‌మీట్‌లో ఇంధనశాఖ కార్యదర్శి, టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, టీఎస్ జెన్‌కో జేఎండీ కృష్ణ భాస్కర్, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూకీ పాల్గొన్నారు.


మున్నూరుకాపు నేతకు జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలని కోరుతూ శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఆ సంఘం నేతలు

కాంగ్రెస్ పాలనంతా దగా

- బోనస్, రుణమాఫీ, ఉచిత కరెంట్, రైతు బంధు.. ఇలా అన్నింటా దగా
- ఎన్నికలు అయిపోతే కరెంటు కోతలే
- అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- మున్నూరుకాపు నేతలతో హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలన అంటేనే దగా అని, అన్ని వర్గాలను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రైతుల ధాన్యానికి ఇచ్చే బోనస్, రుణమాఫీ, ఉచిత కరెంట్, రైతుబంధు.. ఇలా అన్నింటా దగా చేస్తున్నదని మండిపడ్డారు. జహీరాబాద్ ఎంపీ టికెట్ మున్నూరుకాపులకు ఇవ్వాలని ఆ సంఘం నేతలు శనివారం తెలంగాణభవన్‌లో హరీశ్‌రావును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఉండగా రాష్ట్రంలో ఏ రోజూ కరెంటు పోలేదని, నిన్న ఒక ఊరికి వెళ్తే కరెంట్ కోతలు మొదలయ్యాయని రైతులు అవేదన చెందారని తెలిపారు. పదేండ్లలో ఎలాంటి బాధ లేకుండా చూసుకున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ వంద రోజుల్లో 13 హామీలు అమలు చేస్తామని చెప్పిందని, డిసెంబర్ 9నాడే రుణమాఫీ అన్నదని, ఎన్ని 9 తేదీలు మారినా రుణమాఫీ కావటం లేదని విమర్శించారు. ఆ పార్టీ గురించి చెప్పుకుంటూ పోతే మొత్తం 420 దగాలు ఉన్నాయని వివరించారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని ఈ మాత్రం కరెంటు ఇస్తున్నారని, ఎన్నికలు పూర్తయితే కరెంట్ కోతలు పూర్తి స్థాయిలో ఉంటాయని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడే బీఆర్‌ఎస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే బీఆర్‌ఎస్ పోరాటంతోనే సాధ్యం అవుతుందని చెప్పారు. రుణమాఫీ, రైతు బంధు, కరెంట్, బోనస్ ఇవ్వనందుకు రైతులు ఏకమై వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చురుకు పెట్టాలని అన్నారు. మన వేలితో మన కన్ను పొడుచుకోవద్దని, తప్పిపోయి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని, బాండ్ పేపర్ ఇచ్చి రైతులను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడితేనే హామీలు అమలు అవుతాయని తెలిపారు. రెండు సార్లు గెలిపిస్తే పార్టీకి మోసం చేసిన చరిత్ర బీబీపాటిల్‌ది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్నూరుకాపులకు జహీరాబాద్ ఎంపీ టికెట్ వినతిని అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, బీఆర్‌ఎస్ నాయకులు దేవీప్రసాద్, గాలి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నమస్తే తెలంగాణ'పై కాంగ్రెస్ ఫిర్యాదు

జూబ్లీహిల్స్, మార్చి9: 'గురుశిష్యుల రహస్య భేటీ' శీర్షికతో శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, సీఎం రేవంత్‌రెడ్డి బేగంపేట విమానాశ్రయంలో రహస్యంగా భేటీ అయినట్టు వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమని, ఆ వార్త ప్రచురించిన దిన పత్రికపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతో 154/2024యూఎస్, 505(1) (బి) (సి), 505 (2) ఆర్/ డబ్ల్యూ, 109 సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటే బహిష్కరణ

▸ మొదటిపేజీ తరువాయి...

వసతుల డిమాండ్ నేపథ్యంలో ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు, గచ్చిబౌలి నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు, కొత్తగా రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల్లో చేపట్టిన హైకోర్టు ప్రాంతాలను అనుసంధానం చేస్తూ మెట్రోను విస్తరించనున్నట్టు వివరించారు. బీహెచ్‌ఈఎల్ వరకు మెట్రో అందుబాటులోకి వచ్చేలా విస్తరణ ప్రణాళికలను రూపొందించిన ట్టు తెలిపారు. కాలుష్యం కారణంగా నల్లగొండ, హైదరాబాద్‌కు శాపంలాగా మారిన మూసీ నదిని రూ.50 వేల కోట్లతో లండన్‌లోని థేమ్స్ నది తరహాలో అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారు. ఇందుకు వైబ్రంట్ తెలంగాణ-2050 ప్రాజెక్టు పేరిట మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా, తెలంగాణ జిల్లాల సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాలను అర్బన్, సబర్బన్ హైదరాబాద్, రూరల్ తెలంగాణగా విభజించి మెగా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నామని, ఇందుకు అంతర్జాతీయ ప్లానింగ్ సంస్థలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 21% ఫిట్‌మెంట్

▸ మొదటిపేజీ తరువాయి...

ఏమైనా ఉంటే పదవీ విరమణ సమయంలో ఎలాంటి వడ్డీ మినహాయింపు లేకుండా చెల్లిస్తారని తెలిపారు. '2017 పేస్కేల్‌ను 21 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయడం వల్ల ఏటా రూ. 418.11 కోట్లు అదనపు భారం పడుతుందని అంచనా వేశామని' మంత్రి పేర్కొన్నారు. కొత్త పేస్కేల్ 2017 పేస్కేల్‌లోని 42,057 మంది ఉద్యోగులకు, ఏప్రిల్ 1, 2017న పదవీ విరమణ పొందిన 11,014 మంది ఉద్యోగులకు కలిపి మొత్తం 53,071 మందికి ప్రయోజనం చేకూరుతుందని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు.

ఉద్యోగులకు డీఏలు ఎప్పుడిస్తరు?

'కోడ్'కు ముందే విడుదల చేయాలి

బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్ డిమాండ్

మీడియాతో మాట్లాడుతున్న దేవీప్రసాద్, పక్కన పాతూరి

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, కానీ ఇప్పుడు వాటిని మరిచిపోయిందని బీఆర్‌ఎస్ నేత, ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీ ప్రసాద్ విమర్శించారు. ఉద్యోగులకు భ్రమలు కల్పించి ఇప్పుడు గాలికొదిలేయడం తగదని చెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అధికారంలోకి రాగానే పెండింగ్ డీఏలను చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదు. కనీసం ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న డీఏ విడుదల నిర్ణయాన్నైనా అమలు చేయాలి. అది కూడా లోక్‌సభ ఎన్నికల కోడ్ రాక ముందే అమలు చేస్తే బాగుంటుంది. ఒకటో తారీఖున ఉద్యోగులందరికీ జీతాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ చాలా మందికి రావడం లేదు' అని దేవీ ప్రసాద్ తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఉద్యోగుల సమస్యల్లో చాలా వాటిని పరిష్కరించారని గుర్తుచేశారు. కానీ ఇటీవల కొందరు హరీశ్‌రావు వ్యాఖ్యలను వక్రీకరించారని, ఉద్యోగులను ఆయన నుంచి దూరం చేయడానికి కుట్ర పన్నుతున్నారని వెల్లడించారు. కొంతమంది పనిగట్టుకొని చేస్తున్న ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయని చెప్పారు. మాడల్ స్కూళ్లలోని టీచర్లకు సమయానికి జీతాలు రావడం లేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై సోషల్‌మీడియాలో కావాలనే దుష్ప్రచారం జరుగుతున్నదని తెలిపారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగులకు అండగా నిలిచి ఎన్నో సమస్యలను పరిష్కరించారని వెల్లడించారు.

పంటపొలాలను మెడికల్ కాలేజీకి ఇచ్చేది లేదంటూ ముక్తకంఠంతో నినదిస్తున్న కొడంగల్ మండలం అప్పాయిపల్లి రైతులు

మీకు భూమిచ్చి.. మన్ను బుక్కాల్నా?

▸ మొదటిపేజీ తరువాయి...

అసైన్డ్ భూములను సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై అప్పాయిపల్లి అసైన్డ్‌దారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఏ ఒక్క రైతు కూడా భూములిచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఎకరానికి 10 లక్షల పరిహారం, ఇంటికొక ఉద్యోగం ఇస్తామని చెప్తున్నా రైతులు మాత్రం తమ బతుకులను ఆగం చేయొద్దని వేడుకుంటున్నారు. భూమిలిచ్చేది లేదని తెగేసి చెప్తున్నారు. 50 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఈ భూముల మీదే ఆధారపడ్డామని అంటున్నారు. భూమిలిచ్చి మన్ను బుక్కాల్నా? అని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. తాము అభివృద్ధికి అడ్డు కాదని తెలిపారు. గుట్టలు, గుంతలుగా ఉన్న బీడు భూములను సాగులోకి తెచ్చుకున్నామని, బలవంతంగా భూములను లాక్కుంటే ఇంటిల్లిపాది ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. చప్రాసీ ఉద్యోగాలు తమకు వద్దని, భూమితోనే తమ బతుకు అని స్పష్టం చేస్తున్నారు.

మా బతుకులు ఆగమైతయ్

మాకు రెండెకరాల భూమి ఉన్నది. కందులు, పత్తి పండించుకుంటా బతుకుతున్నం. ఈ భూమే మా కుటుంబానికి దిక్కు. అప్పట్లో రోడ్డు వస్తే కొంత భూమి తీసుకున్నరు. ఇప్పుడు ఉన్న భూమి తీసుకుంటే రోడ్డున పడ్తం. ప్రాణాలు తీసినా మా భూములు ఇవ్వం.

– బువ్వ బుగ్గప్ప, అప్పాయిపల్లి

భూములిచ్చి ఎక్కడికి పోవాలి?

మాకు రెండెకరాల భూమి ఉన్నది. కొన్నేండ్లుగా పంటలు పండించుకుంటూ బతుకుతున్నం. ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లను ఈ భూమి ఆధారపడే నడుపుతున్నాం. రెండు నెలల కింద మా ఇంటాయన చనిపోతే ఈ భూమిలోనే కాష్టం చేసినం. మా అత్త, మామ బొందలు కూడా ఈడనే ఉన్నాయి. భూములిస్తే మా కుటుంబం ఆగమైతది, ఎట్ల బతకాలి? ప్రభుత్వం ఇచ్చే పైసలు ఎన్ని రోజులుంటాయి? భూతల్లి ఉంటేనే పంట చేసుకొని బతుకుతం. భూములివ్వాలని వెంట పడుతున్నారు. భూములిచ్చి ఎక్కడికి పోవాలి? ఏం తినాలి?

– అగ్గనూరు నర్సమ్మ, అప్పాయిపల్లి

గురువుతోపాటే శిష్యుడు

▸ మొదటిపేజీ తరువాయి...

మాట్లాడారు. బీజేపీతో రేవంత్ చెట్టాపట్టాల్‌పై తెలంగాణ సమాజం చర్చించుకుంటున్నదని, ఆయన మరో ఏక్‌నాథ్‌షిండే, హిమంత బిశ్వ శర్మ అవుతారని సుమన్ విమర్శించారు. రేవంత్ తన గురువు చంద్రబాబుతో బేగంపేట ఎయిర్‌పోర్టులో రెండు గంటల పాటు చర్చలు జరిపారని వెల్లడించారు. రేవంత్‌ను కలిసిన తర్వాతే చంద్రబాబు అమిత్ షాను కలిశారని, పార్లమెంటు ఎన్నికల తర్వాత రేవంత్‌ను బీజేపీవైపు తీసుకొస్తానని అమిత్‌షాకు బాబు హామీ ఇచ్చారని వివరించారు. చంద్రబాబు టీడీపీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయకుండా కాంగ్రెస్‌కు సహకరించిందని, పొంగులేటి, తుమ్మల టీడీపీ కార్యాలయాలకు వెళ్లి మరీ కృతజ్ఞతలు చెప్పారని గుర్తుచేశారు. మోదీని రేవంత్ పెద్దన్నగా సంబోధించిన తర్వాత వారిద్దరి బంధం బలపడిందని, అందుకు నిదర్శనంగానే కిందిస్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ కలిసిపోయాయని వెల్లడించారు. ఆ రెండు పార్టీలు కలిసి భువనగిరి, నల్లగొండ, నారాయణఖేడ్ మున్సిపాలిటీల్లో అధికారాన్ని పంచుకున్నాయని తెలిపారు. జగిత్యాలలో రెబల్ అభ్యర్థికి బీజేపీ, కాంగ్రెస్ మద్దతు ఇచ్చాయని ఆరోపించారు. మంచిర్యాల, ఖానాపూర్, నస్పూర్ మున్సిపాలిటీల్లో చేతిలో పువ్వు పట్టుకొని సీట్లను కైవసం చేసుకున్నారని విమర్శించారు.

గురుశిష్యుల పాలనలో కరువు

చంద్రబాబు సీఎంగా ఉండగా తెలంగాణలో కరువు ఉండేదని, చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక మళ్లీ కరువు వచ్చిందని సుమన్ ఎద్దేవా చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న బాల్క సుమన్

రేవంత్ సీఎం అయ్యాక తెలంగాణ పరిస్థితి దాచిదాచి దయ్యాల పాలు అయినట్టుగా మారిందని విమర్శించారు. రేవంత్‌కు చంద్రబాబు ఎంత చెబితే అంత అని, గతంలో తన గురువు చంద్రబాబు ఆదేశాల మేరకే తెలంగాణ ఉద్యమకారులపై రేవంత్ రైఫిల్ ఎక్కుపెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నరేంద్రమోదీ చేతిలో రేవంత్ పెడుతున్న తీరును కాంగ్రెస్ శ్రేణులు గమనించాలని సూచించారు. బీజేపీ నేతలు లక్ష్మణ్, డీకే అరుణ చేస్తున్న ప్రకటనలు దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇస్తున్నవేనని అన్నారు. తెలంగాణ ప్రజలూ.. తస్మాత్ జాగ్రత్త! అని పేర్కొన్నారు.

కరెంటు కోతల గుట్టురట్టు

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో 40 నిమిషాలపాటు కరెంటు కట్
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫోన్‌చేసినా ఫలితం నిల్
- చివరికి చీకట్లోనే చెక్కుల పంపిణీ

జగిత్యాల, మార్చి 9 (నమస్తే తెలంగాణ): తమ ప్రభుత్వం క్షణకాలం కూడా పోకుండా విద్యుత్తును సరఫరా చేస్తున్నదని గొప్పలు చెప్పే కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డికి వాస్తవం బోధపడింది. ఆయన స్వయంగా పాల్గొన్న అధికారిక కార్యక్రమంలో 40 నిమిషాలపాటు కరెంటు పోవడంతో ఉక్కపోతకు గురయ్యారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 303 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. ఉదయం 10 గంటలకే ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోగా సభ ప్రారంభమయ్యే సమయానికి కూడా సరఫరాను పునరుద్ధరించలేదు. అధికారిక కార్యక్రమం ఉందని, కరెంటు సరఫరా పునరుద్ధరించాలంటూ అధికారులు జగిత్యాల అర్బన్ తహసీల్దార్ వరంధన్‌ను ఫోన్‌లో సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది. కాసేపటి తర్వాత జీవన్‌రెడ్డే స్వయంగా అధికారులకు ఫోన్‌చేసి కరెంటు ఎందుకు పోయిందని ఆరాతీశారు. ఇది అధికారిక ప్రోగ్రాం అని, తొందరగా పునరుద్ధరించాలని పదేపదే కోరారు. అర గంట గడిచినా కరెంటు జాడ లేకపోవడంతో మరోమారు ఫోన్ చేసి 'ఏమైంది బాబు.. ఇంకా కరెంటు రాలేదు' అని ప్రశ్నించారు. అధికారులు ఆయనకు ఏం చెప్పారన్న విషయం తెలియరాలేదు కానీ, 'ఏపిచ్చేసెయ్ తర్వాత చూసుకుందాం' అని చెప్పడం వినిపించింది. దాదాపు 40 నిమిషాలపాటు కరెంటు రాకపోవడంతో అక్కడివారు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఉక్కపోతతో అల్లాడిపోయారు. అధికారిక సమావేశంలో జనరేటర్, చార్జింగ్ మైక్, తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.


విద్యుత్తు అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

చీరెల పంపిణీని అడ్డుకోవడంతో మహిళల ఆందోళన

తులం బంగారం ఎప్పుడిస్తరు?

జగిత్యాల/జగిత్యాల రూరల్, మార్చి 9: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇంకెప్పుడిస్తారంటూ కాంగ్రెస్ నేతలను జగిత్యాల పట్టణ, మండల మహిళలు నిలదీశారు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పటి నుంచి ఆడబిడ్డలకు చెక్కులతోపాటు చీరెలను అందించే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, ఇప్పుడు కూడా అలానే ఇవ్వాలనుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి కొద్దిదూరంలో లబ్ధిదారులకు చీరలు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధమయ్యారు. విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చి అడ్డుకోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరుపై రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఇస్తానన్న తులం బంగారం ఇవ్వకపోగా, ఎమ్మెల్యే ఇచ్చే చీరను ఇవ్వకుండా అడ్డుకోవడం ఏంటని మండిపడ్డారు. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో వేయకపోవడంపై ప్రొటోకాల్ వివాదంతో గొడవకు దారితీయగా విప్ లక్ష్మణ్ కుమార్ జోక్యంతో సద్దుమణిగింది.

రాజిరెడ్డీ.. ఆర్టీసీలో విలువల్లేని వ్యక్తివి!

టీఎంయూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలోని ఉద్యోగ సంఘాల మధ్య అభిప్రాయభేదాలు వెలుగుచూస్తున్నాయి. భేదాభిప్రాయాల నేపథ్యంలోనే ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ సంఘానికి చెందిన రాజిరెడ్డిపై ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన శనివారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆర్టీసీ ఉద్యోగ సమస్యల పరిష్కారం కాకుండా రాజిరెడ్డి అడ్డుపడుతున్నారని ఆ లేఖలో ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకుండా, పరిస్థితులు కూడా అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. 'రాజిరెడ్డి.. నువ్వు ఆర్టీసీలో విలువల్లేని వ్యక్తివి'.. అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.